

# ప్రతి అక్షరాస్యుడు ఒక ఉపాధ్యాయుడు కావాలి

### సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా నేడు భారీ అవగాహన ర్యాలీలు

### విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ పిలుపు

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో భారీ అవగాహన ర్యాలీలు, అక్షర యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. అనిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను సంపూర్ణ అక్షరాస్య జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్-నవభారత సాక్షరతా కార్యక్రమం కొనసాగుతోందన్నారు. అక్షరాస్యత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అక్షర యజ్ఞంలో భాగ స్వాములు కావాలని కె. అనిత కోరారు. ప్రతి అక్షరాస్యుడు కనీసం ఒకరు లేదా ఇద్దరికి చదువు నేర్పించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దితే జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడం సాధ్య మవుతుందన్నారు. చదవడం, రాయడంతో పాటు నిత్య జీవితంలో అవసరమైన ప్రాథమిక జ్ఞానాన్ని అందించడం ద్వారా అభ్యసనదారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించవచ్చని పేర్కొ న్నారు.

**మహిళల సాధికారతకు ఉల్లాస్ దోహదం...**

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అక్షరాస్యతతో పాటు డిజిటల్ పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత, జీవన నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా మహిళలు తమ నిత్య జీవితంలో ఆత్మవిశ్వాసంతో, ఆత్మ గౌరవంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ నైపుణ్యాలు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంతో పాటు జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా నిర్వహించే ర్యాలీలు, అక్షర యజ్ఞ కార్యక్రమాల్లో మండల విద్యాధికారులు, సమూహ వనరుల వ్యక్తులు, స్వచ్ఛంద ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు, అభ్యసనదారులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కె. అనిత విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామంలో అక్షరాస్యతపై అవగాహన పెంచి, చదువుకు దూరంగా ఉన్న వారిని గుర్తించి వారికి విద్యను అందించడం ద్వారా అక్షరాస్య సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు.

**సామాజిక బాధ్యతగా తీసుకుందాం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు, అక్షర యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్-నవభారత్ సాక్షరతా కార్యక్రమం జరుగుతుందని, ఇదీ ప్రభుత్వ కార్యక్రమమే కాదని, అందరికి ఒక సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. ప్రతి అక్షరాస్యుడు ఒక ఉపాద్యాయునిగా మారాలని జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ సూచించారు. సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి ఈ అక్షర యజ్ఞంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానంగా ఎస్‌హెచ్‌జి మహిళల సాధికారతే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టటం జరుగుతుందన్నారు. మంగళవారం జరిగే అక్షర ర్యాలీ కార్యక్రమాల్లో ఎంఇఒలు, సిఆర్‌పిఎస్‌లు, వలంటీర్ టీచర్లు, ఎస్‌హెచ్‌జి మహిళలు, ప్రజాప్రతినిధులు, అభ్యసన దారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ పిలుపునిచ్చారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## త్వరలో రైతు విశ్రాంతి భవనం నిర్మిస్తాం

**వికారాబాద్, ప్రభాతవార్త :** రైతు శ్రేయస్సు కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం కృషి చేస్తుందని, ఇందులో భాగంగా త్వరలో రైతు విశ్రాంతి భవన నిర్మాణానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు ఏఎంసీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ 3 వ సర్వసభ్య సమావేశం ఏఎంసి చైర్మన్ చాపల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అతి త్వరలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తామని, రైతులకు సేవ చేయడమే లక్ష ్యంగా ముందుకు వెళ్తామని అన్నారు. రైతులు ధాన్యాన్ని అమ్మిన తరువాత వివిధ కారణాల వల్ల సొంత ఊర్లకు వెళ్లే సమయంలో ఆలస్యం జరిగి విశ్రమించేందుకు నానా ఇబ్బందులు ఎదురొనకంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు.







మట్టి గణపతులను పూజిద్దాం నినాదం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి తదితర అధికారులు

# ప్రకృతిని కాపాడదాం

### ఎకో గణపతులకే జైకొడదాం..

### ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు స్వస్తి చెప్పండి

### కలెక్టర్ నారాయణరెడ్డి పిలుపు

### ఊపందుకున్న మండపాల ఏర్పాట్లు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తుం డటంతో రంగారెడ్డి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గణపతి మండపాల ఏర్పాట్లు ఊపం దుకున్నాయి. స్థానిక వీధుల నుంచి ప్రధాన కూడళ్ల వరకు వివిధ స్థాయిల్లో విగ్ర హాలను నెలకొల్పేందుకు నిర్వాహకులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఏటా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగుల వల్ల వాతావరణం, జలవనరులు తీవ్రంగా కలుషితమై అనేక ఇబ్బందులు తలెత్తు తున్నాయి. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థ లు, పర్యావరణ ప్రేమికుల చొరవతో ఎకో గణపతి విగ్రహాల దిశగా ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. ప్రతిఏటా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న పలు సం స్థలు, ఈ ఏడాది కూడా అదే దిశగా విస్తృత ప్రయత్నాలు సాగిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో అధికారులు సైతం చురుగ్గా భాగస్వాములవుతున్నారు. సోమ వారం ప్రజావాణి అనంతరం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వ ర్యంలో రూపొందించిన మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షి ద్దాం అనే సందేశంతో కూడిన పోస్టర్‌ను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 14న జరగనున్న వినాయక చవితిని ప్రజలందరూ పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు స్వస్తి చెప్పి, మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్ఠించాలని సూచించారు. పూజల్లో సహజసిద్ధమైన రంగులు, పర్యావరణానికి హాని చేయని అలంకరణ సామగ్రినే వినియోగించాలని పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సంబంధిత శాఖల అధికారులు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

**ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు**

అంతకుముందు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 27, ఇతర శాఖలకు సంబంధించినవి 29 ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి అందే ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇకెవైసి తప్పనిసరి



### ఆధార్, మొబైల్ నంబర్ అనుసంధానం చేసుకోండి

### రేషన్ కార్డుదారులకు పౌర సరఫరాల శాఖ అలర్ట్

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** రేషన్ కార్డుదారులు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని ఈ కేవైసీ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత సూచించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేషన్ కార్డు నంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు, ఆధార్‌లో నమోదైన వివరాలు సరిగా ఉన్నాయో లేదో లబ్ధిదారులు పరిశీలించుకోవాలని ఆమె తెలిపారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, ఓటీపీ ద్వారా ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొబైల్ నంబర్ నమోదు చేయడం ద్వారా రేషన్ కార్డుకు సంబంధించిన సమాచారం, సేవల వివరాలు ఎస్ఎంఎస్‌ల రూపంలో అందుతాయని వనజాత వివరించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఈకేవైసీని 100 శాతం పూర్తి చేయాలని, ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ నంబర్ వివరాలను సక్రమంగా అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో ఈ ప్రక్రియను వేగవంతంగా చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను పౌర సరఫరాల అధికారి వనజాత ఆదేశించారు.

## ఎంపిడివో ఆఫీసులో మంచినీళ్లు దొరకవ్

4లో

# మ్యాపింగ్ లేని ఓటర్లకు నోటీసులు

### సర్ ప్రక్రియపై అధికారులకు కలెక్టర్ ఆదేశం

**వికారాబాద్, ప్రభాతవార్త :** జనగణన కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి తహసీల్దార్‌లతో జూమ్ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగినదని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జనగణనపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనగణనలో విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన శిక్షణ, మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. నిర్ణీత మార్గదర్శకాలు, గడువులను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా ప్రతి దశను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మ్యాపింగ్ లేని ఓటర్లు, వివిధ రకాల అనామలీస్ గుర్తించిన ఓటర్లకు సంబంధించి నోటీసులు తప్పనిసరిగా జనరేట్ చేసి, సంబంధిత ఓటర్లకు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన సమయం కల్పించి విచారణ నిర్వహించాలని సూచించారు.

జిల్లాలోని 22 ఎ భూముల వివరాలు, పెండింగ్ దరఖాస్తులు, రికార్డుల పరిశీలన తదితర అంశాలపై తహసీల్దార్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. 22ఎ భూములకు సంబంధించి ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుదీర్, ఆర్డీఓ వాసుచంద్ర, సిపిఓ వెంకటేశ్వర్లు, డీపీఓ జయసుధ, ఇ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**ప్రతి ఫిర్యాదుకూ ప్రాధాన్యం : అదనపు కలెక్టర్**

ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటచారి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈప్రజావాణిలో 103 ఫిర్యాదులు స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం నందు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించి ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సక్రమంగా అందేలా అధికారులు బాధ్యతతో పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటచారి



కుల్కచర్లలో అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నేతలు

## హామీలు అమలు చేయాలని వినతులు

### ప్రభుత్వ కార్యాలయాల బాట పట్టిన గులాబీ టీం

2లో

## ఫీజు బకాయిల కోసం

# బిజెపి ఫైట్

### అసెంబ్లీ ముట్టడికి యత్నించిన నేతలు -అరెస్టులపై కాషాయ దళం నిరసన



బిజెపి నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**పెద్దేముల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** విద్యార్థులకు వెంటనే ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తు భారతీయ జనతాపార్టీ ఇచ్చిన పిలుపుమేరకు వికారాబాద్ జిల్లా ఆపార్టీ అధ్యక్షుడు యు. రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు సోమవారం అసెంబ్లీ ముట్టడి చేశారు. అసెంబ్లీ వైపు దూసు కొస్తున్న బిజెపి శ్రేణులను పోలీసులు తీవ్రంగా అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించిన పలువురు జిల్లా ముఖ్య నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని అన్నారు. గత ఎన్నికల సమ యంలో ఇచ్చిన హామీలను నెరవెర్చకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. డిమాండ్లను పరిష్కరించకుండా ప్రశ్నించే వారిపై అక్రమ అరెస్టులతో అణచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. విద్యార్థుల. ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు బిజెపి పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శులు, నియోజకవర్గ ఇంచార్జి మోర్చాల నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



వికారాబాద్‌లో అరెస్ట్ అయిన బిజెపి నాయకులు

**అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం**

**వికారాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని, బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని బీజేపీ మెడికల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ముట్టడిలో భాగంగా వెళ్ళిన బీజేపీ మెడికల్ సెల్ నాయకులను అరెస్టు చేసి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వికారాబాద్ జిలా మీడియా కన్వీనర్ మోహన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య, నాయకులు శ్రీనివాస్, లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మనవిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రరావుకి సంఘీభావం**

**షాద్‌నగర్ :** విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావును అరెస్టు చేసి గోల్కొండ పోలీస్ స్టేషన్లో నిర్బంధించడాన్ని నిరసిస్తూ షాద్‌నగర్ బీజేపీ నాయకులు

>>2

# అంగరంగ వైభవం

### అంబురామన్న జాతరకు పోటెత్తిన భక్తజనం

### శివనామ స్మరణతో మారుమోగిన ఆలయ పరిసరాలు

**పెద్దేముల్, ఆగస్టు 18, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం తట్టెపల్లి అటవీప్రాంతలో వెలిసిన అంబురామన్న జాతరకు భక్తజనం పోటెత్తారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో వికారాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, సంగారెడ్డి జిల్లాలో నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొని అంబు రామేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. శ్రావమాసం ప్రారంభం నుంచి చివరి వరకు ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు స్వామి వారి దర్శన అనంతరం విరమిం పచేశారు. దట్టమైన అటవీప్రాంతంలో వెలిసిన అంబురామేశ్వరుడి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తుల కోలహలం, భజన సంకీర్తనలతో ఆలయ పరిసరాలు శివనామ స్మరణతో మారుమోగాయి. భక్తులకు అన్ని రకాల వసతులను ఆలయ కమిటి అధ్యక్షుడు వెంకటేశం ఏర్పాట్లు చేశారు. బారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అంబు రామేశ్వరుడిని ఎమ్మెల్యే బుయ్యాని మనోహరరెడ్డి, వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, ఉప్పరి మల్లే శం, లొంక నర్సిములు, గాజిపూర్ లాల్‌రెడ్డి, జనగాం మధు సేధన్‌రెడ్డి, నసీర్, హర్షవర్ధన్‌రెడ్డి, జనగాం సర్పంచ్ అరుణ, తదితరులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన వారిలో ఆలయ కమిటి అధ్యక్షులు యు.వెంకటేశం, నారా యన్‌గౌడ్, డీలర్ అంజయ్య, మాజీ వైస్ యంపిపి లక్ష్మన్, చందు తదితరులు ఉన్నారు.



జాతరకు హాజరైన భక్తజనం



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్, డిఎంఅండ్‌హెచ్ఓ ఆనంద్

2లో

## ఫీజు బకాయిల కోసం ఫైట్

(మొదటి పేజీ తరువాయి)

పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి వారిని కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అరెస్టులు, నిర్బంధాలతో బీజేపీ పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మోహన్ సింగ్, ధార్మిక సెల్ కన్వీనర్ పసుల నరసింహ యాదవ్, కొందుర్గు, నందిగామ, కొత్తూరు మండలాల అధ్యక్షులు లక్ష్మీ ౹ కాంతరెడ్డి, అర వింద్ చారి, మహేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, సీనియర్ నాయకులు సుధాకరప్ప, హాజీ పల్లి ఉపసర్పంచ్ గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, అనిల్ కుమార్ గౌడ్, రాజు నాయక్, రాకేష్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

**అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు**

**కుల్కచర్ల, సెప్టంబరు 7, ప్రభాతవార్త :** అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని మండల అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. ఫీజు బకాయాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి వెల్తున్న బిజెపి నాయకులను కుల్కచర్ల పోలీసులు అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ... అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజాగ్రహాన్ని అణిచివేయలేరని చెప్పుకుచ్చారు. తెలంగాణలో ప్రజాస్వామ్మ పాలన నడుస్తోందా... లేక పోలీస్ బలగాలతో పాలిస్తున్నారా అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే. బకాయాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజిలయ్య, ఉప సర్పంచ్ బిజయ్ కుమార్, దిశకమిటి మెంబర్ జానకిరామ్ చౌహన్, అసెబ్లి కనీర్వర్ మహిపాల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వరునికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పూజలు

**బషీరాబాద్, సెప్టెంబరు 7,ప్రభాతవార్త:** శ్రావణమాసం చివరి సోమవారం కావటంతో భక్తులు శ్రీ ఏకాంబరి రామలింగేశ్వర స్వామి దర్శనానికి భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని బషీరాబాద్ మండలం నీళ్ళపల్లి గ్రామ దట్టమైన అడవి ప్రాంతం, లోతైన కొండల మధ్య స్వయంభుగా వెలిసిన శ్రీ ఏకాంబరి రామలింగేశ్వరుని దర్శినానికి తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపి నుండి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి రామలింగేశ్వరునికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొటోకాల్ పాటించటంలేదని నిరసన

**చేవెళ్ల, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ యాదగిరి మున్సిపల్ కమిషనరా? లేక కాంగ్రెస్ పార్టీ ఏజెంటా? అని చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్లు సువర్ణ, దూత మల్లేష్, దేవరపల్లి శ్రీనివాస్ రెడ్డి, మంగమ్మ మల్లేష్లు ప్రశ్నించారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు సువర్ణ, దూత మల్లేష్, దేవరపల్లి శ్రీనివాస్ రెడ్డి, మంగమ్మ మల్లేష్లు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ప్రోటోకాల్ పాటించకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నాడని అన్నారు. తమ వార్డులల్లో జరుగుతున్న శంకుస్థాపనలు, ప్రారంబోత్సవాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. రెండు రోజులుగా ఊరెళ్ళ, పలుగుట్ట గ్రామాలలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమత దేవర వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. కాని మాకు మాత్రం కనీస సమాచారం కూడ ఇవ్వలేదన్నారు. ప్రోటోకాల్ ప్రకారం కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాల్సి ఉన్న కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను అవమానించడం జరుగుతుందని వాపోయారు. మొదటినుంచి బారాస కౌన్సిలర్ అంటే చులకనగా చూస్తున్నారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లపై కమిషనర్ చిన్న చూపు చూస్తున్నారని, మున్సిపల్లో జరుగుతున్న ప్రతి అబివృద్దికి సంబందించిన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కెసిఆర్ హామీలపై ఎందుకు ప్రశ్నించలేదు?

**షాద్నగర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన దళితులకు మూడు ఎకరాల భూమి, దళితుడిని ముఖ్యమంత్రిని చేయడం, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, మైనార్టీ రిజర్వేషన్లు, ఫీజు రీయింబర్స్మెంట్ తదితర హామీలపై ప్రజా సంఘాలు ఎందుకు ప్రశ్నించలేదని ఆదివాసీ కోఆర్డినేటర్ పి. రఘు నిలదీశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ గత ప్రభుత్వ హయాంలోనే మంజూరైందని, ఇప్పుడు అదే అంశంపై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం షాద్నగర్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీ ఖాన్ బాబర్, నాయకులు ఎండీ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, షర్ఫుద్దీన్ తదితరులతో కలిసి రఘు మీడియాతో మాట్లాడారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు మధుహంసిని ఎంపిక

**షాద్నగర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల అండర్19 క్రికెట్ పోటీలకు ఎంపికల్లో షాద్నగర్కు చెందిన మధు హంసిని ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్కు ఎంపికైంది. షాద్నగర్లోని ఇంట్రో 21 క్రికెట్ అకాడమీ నుంచి మధు హంసిని రాష్ట్ర స్థాయి ఎంపికలకు అర్హత సాధించడం పట్ల అకాడమీ నిర్వాహకులు, కోచ్లు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. మధు హంసిని గత రెండేళ్లుగా ఇంట్రో 21 క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతూ క్రమశిక్షణ, అంకితభావంతో నిరంతరం సాధన చేస్తోంది.



ఈ క్రమంలో తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ అండర్19 రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్కు ఎంపిక కావడం షాద్నగర్కు గర్వకారణమని కోచ్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు.త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్ మ్యాచ్లలోనూ మధు హంసిని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ అండర్19 జట్టులో స్థానం సంపాదించాలని, తద్వారా షాద్నగర్కు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా మధు హంసినికి కోచ్ జ్ఞానేశ్వర్తో పాటు ఇంట్రో 21 క్రికెట్ అకాడమీ ప్రతి నిధులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## నేత్రదానంపై అవగాహన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మేడ్చల్ జిల్లా కలెక్టరేట్లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం నేత్ర పరీక్షల శిబిరం జరిగింది. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ పాల్గొని నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్పి) డాక్టర్ బరీరాఫరీద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (యుఎల్సి) సి.మోక్షితాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ కౌశిక్, పలువురు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సివిల్స్ అభ్యర్థులకు ఇండియన్ ఎకానమీ

**షాద్నగర్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :** ఆర్థిక శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్రెడ్డి రచించిన ఇండియన్ ఎకానమీ పుస్తకానికి అరుదైన గుర్తింపు లభించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించబడిన ఈ గ్రంథం ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీతో పాటు చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో రిఫరెన్స్ గ్రంథంగా అందుబాటులోకి వచ్చింది. సివిల్స్, గ్రూప్1, గ్రూప్2 తదితర పోటీ పరీక్షలకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరమని విద్యావేత్తలు అభినందించారు. తెలుగు మాధ్యమంలోనూ పుస్తకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరారు. భవిష్యత్తులో మరిన్ని విజ్ఞాన గ్రంథాలను రచిస్తానని డాక్టర్ రవీందర్రెడ్డి తెలిపారు.

## ఘట్కేసర్లో ప్రజావాణి దిగ్బంధనం

**ఘట్కేసర్, సెప్టెంబరు7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీఆర్ఎస్పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఎంఎంసి ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఘట్కేసర్ రైతు సహకార సేవా సంఘంలో ఋణాలు తీసుకున్న 1,149 మందికి రైతులకి రుణమాఫీ చేయాలని ప్రజావాణిలో ఎంఎంసీకి, గాంధీ విగ్రహానికి కూడా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయాలి




పెద్దేముల్లో వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు



షాద్నగర్లో వినతిపత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**పెద్దేముల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బిఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైల్రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన 420, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల హామీలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రజావాణిలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కోహీర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రంగయ్యతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైల్రెడ్డి మాట్లాడుతూ ఆడబిడ్డలకు మహాలక్ష్మి పథకం కింద రూ. 2500, తులం బంగారం, స్కూటి, రైతన్నలకు రైతు భరోసా,ఎరువుల పంపిణి, 24 గంటల కరెంటు, రైతు కూలీలకు 12 వేలు, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, వృద్దులు, దివ్యాంగులకు, బీడి కార్మికులకు పెంచిన రూ. 4 వేలు పించన్ తదితర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా ప్రభుత్వ హామీలను అడిగితే అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలోని అర్హులైన ప్రతి సభ్యుడికి ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల ప్రకారం ప్రయోజనాలు అందించాలని అన్నారు. హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం ఆగదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపసర్పంచ్ల సంఘం అధ్యక్షులు డివై ప్రసాద్, ఆయా గ్రామాల సర్పంచ్లు డివై నర్సిములు, జ్ఞానేశ్వర్, లక్ష్మన్,మాజీ సర్పంచ్లు వీరప్ప, శ్రీనివాస్, చంద్రప్ప, జనార్ధన్రెడ్డి, నర్సిములు, సీనియర్ నాయకులు రమేష్, యాదప్ప, శ్రీనివాస్, విఠల్, అంజి, వెంకట్, సత్తార్, యువనాయకులు రవికుమార్రెడ్డి, కిషన్, మాధవరెడ్డి, శ్రీనివాస్గౌడ్, నాగేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

**కుల్కచర్ల :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మాజి రైతు బంధు అధ్యక్షులు రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణిలో అధికారులకు బీఆర్ఎస్ నేతలు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్లు 6 గ్యాంరెంటిలను సమర్ధవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో బిఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రావడం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

**అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం తగదు**

**షాద్నగర్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులతో అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి షాద్నగర్ ఎంపీడీఓ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించే ప్రతిపక్ష గొంతును నొక్కేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ప్రజా స్వామ్యానికి రాజ్యాంగం ద్వారా బలమైన పునాది వేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని ప్రజలకు తెలియజేస్తున్నామని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను ఎన్ని విధాలుగా అడ్డుకున్నా బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను, హామీలను వెంటనే అమలు చేసి తీరాలని బీఆర్ఎస్ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఫరూఖ్నగర్ మండల పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పాల్గొని, స్థానిక ఎంపీడీవో శ్రీకాంత్కు విజ్ఞాపన పత్రాన్ని (మెమోరాండం) అందజేశారు.

**ప్రజలను పూర్తిగా దగా చేశారు**

**ఆమనగల్లు:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కల్వకుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్యాదవ్ డిమాండ్ చేశారు. అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తరువాత ఏఒక్క హామీని సక్రమంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందుతుందని ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రాలలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల పార్టీ అధ్యక్షుడు పొనుగోటి అర్జున్రావు నేతృత్వంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి కల్వకుర్తి మాజీ శాసనసభ్యుడు గుర్కా జైపాల్యాదవ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈమేరకు ఎంపీడీఓ కార్యాలయం నుండి రాజీవ్ చౌరస్తా వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా గుర్కా జైపాల్యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను పూర్తిగా దగా చేసిందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకుండా తాత్సర్యం చేస్తూ మోసగిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో అధికారంలోకి వచ్చిందని, కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆడబిడ్డలకు తులం బంగారం, స్కూటీలు, విద్యార్థులకు స్కాలర్షిప్లు, నిరుద్యోగులకు జాబ్క్యాలండర్, వృద్దులకు, వితంతువులకు రూ. 4వేల ఫించన్ల హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంనుంతల సర్పంచు శ్రీనునాయక్, కౌన్సిలర్లు నాగిళ్ళ జగన్, అనుముల రమేష్, దుడ్డు ఆంజనేయులు, ఎంగలి భాగ్యలక్ష్మీరఘు, పుల్లారెడ్డి శ్రీశైలం, నాయకులు సయ్యద్ ఖలీల్, సైదులుగౌడ్, చుక్క నిరంజన్గౌడ్, కమటం వెంకటయ్య, వస్పుల సాయిలు, లండం యాదయ్య, రమేశ్నాయక్, దేరంగుల వెంకటేశ్, కొమ్ముప్రసాద్, రాములు,మహేశ్, గుద్దేటి మహేశ్, మలేపల్లి పరమేశ్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ చైర్మన్కు ఎస్ఐఆర్ నోటీసు..

**షాద్నగర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకుంటున్న పలువురు ఓటర్లు తర్జన భర్జనకు గురవుతున్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసినప్పటికీ చిన్నచిన్న వివరాల పొరపాట్ల కారణంగా కొందరు ఓటర్లకు నోటీసులు జారీ అవుతున్నాయి.

బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందజేస్తూ, సంబంధిత పత్రాలతో మున్సిపల్ కార్యాలయానికి హాజరై విచారణకు సహకరించాలని సూచిస్తున్నారు. ఇదే క్రమంలో షాద్నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్కు కూడా నోటీసు అందింది. ఓటరు వివరాల్లో ఆయన ఇంటిపేరు అగ్గనూరుకు బదులుగా అగ్గనూర్గా నమోదు కావడంతో నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో సోమవారం నోటీసుకు సమాధానంగా మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ సంబంధిత పత్రాలను అధికారులకు సమర్పించారు. పేరు వివరాలను సరి చేసి, అవసరమైన ఆధారాలను ఎంఈఓ మనోహర్, బీఎల్ఓ శైలజ తదితర అధికారులకు అందజేశారు. అనంతరం ఆయన ఓటరు వివరాల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. చిన్నపాటి అక్షర దోషాలు, పేర్లలో వ్యత్యాసాలు ఉన్నప్పటికీ అధికారులు నోటీసులు జారీ చేసి వివరాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో, ఓటర్లు ఆందోళన చెందకుండా సంబంధిత పత్రాలతో అధికారులను సంప్రదించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచిస్తున్నారు.

# గిరిజన ఆదివాసీ హక్కులను కాపాడాలి

**షాద్నగర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల పట్ల వివక్షత చూపుతూ, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయకుండా ఆదివాసీ గిరిజనులను వారి భూముల నుంచి వెళ్లగొట్టే కుట్రలను వెనక్కి తీసుకోవాలని గిరిజనుల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ గిరిజన సంఘం, ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయక్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గిరిజనులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వాటి పరిష్కారంపై తగిన చర్యలు తీసుకోవడం లేదని వారు అన్నారు అదే రకంగా దేశవ్యాప్తంగా ఆదివాసి గిరిజనులు తమ సమస్యలకు పరిష్కారం కోసం ఢిల్లీ నడిబొడ్డున జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున మహాధర్నా నిర్వహించి తమ సమస్యల పరిస్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాటం నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు.

అదే విధంగా అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గిరిజనులకు భూమిపై హక్కులు కల్పించాలని, గిరిజనులను వారి సాగుభూముల నుంచి తొలగించే చర్యలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు పోడు సాగుదారులకు హక్కు పత్రాలు అందించాలని కోరారు. అదే విదంగా దేశంలో గిరిజన నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతోందని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సంస్థల్లో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడం లేదని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, భూమి తదితర మోలిక సమస్యలను పరిష్కరించడంతో పాటు గిరిజనుల రాజ్యాంగ హక్కులను పరిరక్షి ంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు ఈ మహాధర్నాలో గిరిజనుల భూ సమస్యలు, అటవీ హక్కుల చట్టం అమలు, నిరుద్యోగం, విద్య, వైద్యం తదితర సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ తమ హక్కుల కోసం నిరంతరం పోరాటం నిర్వహిస్తామని వారు అన్నారు అదే రకంగా ఈ మహ ధర్నా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి గిరిజన ఆదివాసులు పాల్గొన్నారు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నాయకులు గోపి నాయక్ నేనావాత్ పార్వతి శంకర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

# ఎంపిడివో ఆఫీసులో మంచినీళ్లు దొరకవ్

**దప్పిక తీర్చుకునే అవకాశం లేక అర్జీదారుల అవస్థలు**

**ధారూర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం అధికారుల నిర్లక్ష్యానికి, పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా మారుతోంది. వివిధ పనుల నిమిత్తం సుదూర గ్రామాల నుంచి కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీసం త్రాగునీరు కూడా లభించని దుస్థితి నెలకొంది. కార్యాలయానికి వచ్చే ప్రజలే కాకుండా, అక్కడే విధులు నిర్వహించే సిబ్బంది సైతం తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయానికి క్రమం తప్పకుండా నీరు అందించే వాటర్ బాయ్కి సకాలంలో బిల్లులు లేదా డబ్బులు చెల్లించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు సమాచారం. బకాయిలు చెల్లించకపోవడంతో సంబంధిత వ్యక్తి నీటి సరఫరాను నిలిపివేసినట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికార కేంద్రంలోనే కనీస మోలిక వసతులు కరువవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న తరుణంలో కార్యాలయానికి వచ్చేవారికీ, ఉద్యోగులకు తాగునీటి ఎద్దడి ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా జిల్లా మండల స్థాయి అధికారులు తక్షణమే స్పందించి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని... కార్యాలయంలో త్రాగునీటి వసతిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఎంపిడివో కార్యాలయంలో దర్శనమిస్తున్న ఖాళీ బాటిళ్లు



## కరాటే పోటీల్లో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ

**మేడ్చల్, సెప్టెంబరు 7. ప్రభాతవార్త :** గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 5 నుండి 6వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా ౹టైక ఓపెన్ కరాటే ఛాంపియన్ పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థిని విద్యార్థులు పథకాలు సాధించారు. యశస్వి, వర్షిని, ఉదయ్లు గోల్డ్ మెడల్ సాధించగా, నితీష్, శివాని సిల్వర్ మెడల్ సాధించారు. అదే విదంగా పూజ్య శ్రీత, ధృతి, సహస్ర, సహస్వి, మోహన్ కృష్ణారెడ్డిలు బ్రాన్స్ మెడల్స్ సాధించారు. కాగా ఓపెన్ గ్రాండ్ ఛాంపియన్షిప్ ఫైట్ విభాగంలో గోవింద గుప్తా రెండవ స్థానం సాధించాడు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ధారాసింగ్

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి

**పెద్దేముల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** నూతన ఇందిరమ్మ ఇళ్ళలో సకల శుభాలు కలుగుగాకా అని వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్ ఆకాంక్షించారు. సోమవారం పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో బోయిని పకిరమ్మ రాములు, నారబోయిని సుజాత రవిందర్, వడ్డె శిరీష యాదయ్య ఇందిరమ్మ ఇళ్ళను డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కళను సాకారం చేయడం కాంగ్రెస్కే సాధ్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేస్తామని అన్నారు. నూతన ఇందిరమ్మ ఇళ్ళలో వెయ్యి శుభాలు కలిగి కుటుంబ సభ్యులు పిల్లపాపలతో నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ, మండల కాంగ్రెస్పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్రెడ్డి, ఏబ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్రెడ్డి, శ్రీనివాస్రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ మహేష్, వార్డు సభ్యులు చెక్క నర్సిములు, మల్లేశం, నాయకులు మధుసుధన్రెడ్డి, శివకుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

**కుల్కచర్ల, సెప్టంబరు 7 ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక చింతనతో మానసిన ప్రశాంతత కలుగుతుందని బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప శ్రీ శివరామ దుర్గ అన్నారు.శ్రావణ మాసం చేవరి సోమవారం పురస్కరించుకోని మండల పరిధిలో ఘణపూర్ గ్రామంలో కోలువుదిరిన శ్రీ శివరామ దుర్గ క్షేత్రాని సందర్శించి అభిషం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావాలు పెంపోందించుకోవాలని ఆధ్యాత్మిక చింతనతో మానసిన ప్రశాంతత కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వెంకటయ్య గౌడ్, కుల్కచర్ల సర్పంచ్ ఆంజిలయ్య, మాజి సర్పంచ్ జానకిరామ్ నాయక్,మండల అధ్యక్షులు వెంకటేష్, ఘణపూర్ మాజి సర్పంచ్ విజయ లక్ష్మి వేపుగోపాల్ గౌడ్,పిఎస్పిఎస్ వ్యవస్థపక అధ్యక్షులు రాఘవేందర్ గౌడ్,అసెంబ్లి కన్వీనర్ మహిపాల్ బీజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అంబేడ్కర్పై అనుచిత వాఖ్యలు తగదు

**కుల్కచర్ల, సెప్టంబరు 7 ప్రభాతవార్త :** అంబేద్కర్పై అనుచిత వాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల అధ్యక్షులు కర్రె భరత్ కుమార్ డిమాండ్ చేశారు. అంబేద్కర్పై అనుచిత వాఖ్యలు చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో దళిత, బహుజన సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్పై అనుచిత వాఖ్యలు చేసిన వారిని కఠిన శిక్షించాలని సూచించారు. ఈ కార్య క్రమంలో దళిత, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఆధార్ సేవా కేంద్రం ప్రారంభిస్తున్న తాసీల్దార్, ఎంపిడిఓ

## కోట్పల్లిలో నూతన ఆధార్ సేవా కేంద్రం

**కోట్పల్లి, సెప్టెంబరు,7 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కోట్పల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని సోమవారం నాడు తహశీల్దార్ అనంద్రావు, ఎంపీడీఓ హేమంత్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ. మండల ప్రజలకు ఆధార్ సంబంధిత సేవలు సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఆధార్ కేంద్రం ఏర్పాటుతో మండల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఆధార్ కార్డులో పేర్లు, చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాల మార్పులు, చేర్పులతో పాటు అవసరమైన ఆధార్ సంబంధిత సేవలను స్థానికంగానే పొందే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సమ్మప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిరాజోద్దిన్, వార్డు సభ్యురాలు ఇష్రత్ బేగం, చిత్తంపల్లి సుదర్శన్, సంకు వెంకయ్య, కావలి అనంతి, బాసారం పాండు, శ్రీశైలం స్వామి, రాజశేఖర్ స్వామి, లక్ష్మీ ౹నారాయణ చారి, ఉప్పరి నారాయణ, రాంరెడ్డి, నర్సింలుగౌడ్, మాజీ వార్డు సభ్యులు వెంకట్, సమద్, ఇస్మాయిల్ ఖురేషి, అయూబ్ ఖురేషి, అమీర్ ఖురేషి, రియాజ్ ఖురేషి, పెద్దల్లి సత్తి, బందయ్య, సాంబ, తలారి శీను, మొసీన్, సలీం పోస్టుమాస్టర్ క్రాంతికుమార్, ఆధార్ సూపర్వైజర్ నవీన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చెరువును అభివృద్ధి చేయాలని హైడ్రాకు వినతి

**ఘట్కేసర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ఘట్కేసర్ సర్కిల్ ఎదులాబాద్ లక్ష్మినారాయణచెరువును కాలుష్యం నుంచి కాపాడి తగిన అభివృద్ది చేయాలని ఎదులాబాద్ నాయకులు సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ను కలిసి వినతిపత్రం అందజేశారు. దాదాపు 400 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న లక్ష్మినారాయణచెరువుపై వ్యవసాయం, చేపల వేట ద్వారా వేలాది కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. నారాయణరావుచానల్ ద్వారా మూసీ కాలుష్యపు నీరు, ఎరుమల్లెవాగు ద్వారా జవహార్నగర్ డంపింగ్యార్డు, పారిశ్రామిక వ్యర్థాలు వచ్చి చెరువులో కలుస్తుండటంతో నీరు పూర్తిగా కలుషితమైందని తెలిపారు. చెరువు కాలుష్యపు నీటితో పంటలు సరిగా పండక రైతులు నష్టపోతున్నారని, చేపలు చనిపోయి మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్కు వివరించారు. చెరువులోకి కాలుష్యపు నీరు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

# అప్పాయిపల్లిలో ఘనంగా సరస్వతిమాత విగ్రహ ప్రతిష్టాపన



సరస్వతిమాత అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మేన్

**కొడంగల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** కొడంగల్ మండలపరిధిలోని అప్పాయిపల్లిగ్రామంలో సరస్వతిమాత విగ్రహప్రతిష్టాపన, ఆలయ ప్రారంభోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం గ్రామస్తులు ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సరస్వతిమాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బాల్‌రాజ్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి తదితరులు సరస్వతి మాతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామఅధ్యక్షులు సంగప్ప, ఉపసర్పంచ్ పకీరప్ప, వార్డు సభ్యులు గోకుల్‌సింగ్, రాములు, బందెయ్యగౌడ్ , దీపక్‌సింగ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు సంతోష్, మధుసుదన్‌రెడ్డి, రాజు , జనార్దన్, గ్రామస్తులు దత్తుసింగ్, కిషన్‌సింగ్, కిరణ్‌సింగ్, బాల్‌రాజ్‌గౌడ్, కిష్టప్ప, భగవంతు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

# చేవెళ్ల మున్సిపాలిటీ నూతన కాంగ్రెస్ కమిటీ ఎంపిక

**చేవెళ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**
చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు పలుగుట్ట కాంగ్రెస్ పార్టీ నూతన వార్డు కమిటీని ఎంపిక చేశామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షులు బి. శ్రీనివాస్ గౌడ్, పీసీసీ కార్యదర్శి ఎం. జనార్దన్ రెడ్డిలు తెలిపారు.

సోమవారం పల్లుట్ట గ్రామంలో ఎన్నికలు నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలేయాదయ్య శాలువాలతో సన్మానిం చారు. నూతన వార్డు కమిటీలో వార్డు అధ్యక్షుడిగా మల్లారి బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎర్ర శ్రీపాల్, నారెగూడెం అశోక్, చాకలి చంద్రయ్య, ప్రధాన కార్యదర్శులుగా వడ్డే శేఖర్, వనం మధుసూదన్, శివ కుమార్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బుల్కాపురం శేఖర్ రెడ్డి, కార్యదర్శులుగా పూలగుర్ల మల్లారెడ్డి, గంగారం రవి, సంగం జంగారెడ్డి, గంగిడి శేఖర్ రెడ్డి, సలహాదారులుగా గంగిడి బుచ్చి రెడ్డి, వడ్డే రాములు, పూలగుర్ల బుచ్చిరెడ్డి, దేవులపల్లి బోజి రెడ్డి, సంగం మల్లారెడ్డి, గంగిడి జంగా రెడ్డి, మల్గారి నర్సింహా రెడ్డి, మల్గారి నర్సింహారెడ్డి, ఎం. నర్సింహారెడ్డి, మల్గారి సుధాకర్ రెడ్డి, వడ్డే అనంతయ్య, బి.ఎల్.ఏగా గంగిడి మధుసూదన్ రెడ్డి ఎన్నికయ్యారు.

5వ వార్డు యూత్ కాంగ్రెస్ కమిటీ5వ వార్డు యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా దేవులపల్లి సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బీళ్ల సురేందర్, ప్రధాన కార్యదర్శులుగా పోతుగంటి శ్రీకాంత్, మల్లారి ప్రవీణ్ రెడ్డి, బండామిది మదన్ కార్యదర్శులుగా సాలా సందీప్ కుమార్, గంగిడి కొండల్ రెడ్డి, పోలీస్ విష్ణునాథ్ రెడ్డి, నంగం ప్రణీత్ రెడ్డి, సంగం జితేందర్ రెడ్డి,



నూతనంగా ఎన్నికైన పల్లుట్ల గ్రామ కాంగ్రెస్ కమిటిని సన్మానిస్తున్న చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య

కవ్వర్ శరత్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లుగా మహమ్మద్ ముజీబ్, రాళ్లగూడెం ప్రభాకర్ రెడ్డిలను ఎన్నుకున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్ కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి, సుచరిత బల్వంత్ రెడ్డి, యాదిరెడ్డి, శంకర్, రాళ్ల గూడెం రామ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గిరిధర్ రెడ్డి, ముడిమ్యాల సొసైటీ వైస్ చైర్మన్ మల్లేష్, చేవెళ్ల మండల మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మాజీ సర్పంచులు మల్గారి మోహన్ రెడ్డి, ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రామ్ రెడ్డి తిరుపతి రెడ్డి నాయకులు రవీందర్ రెడ్డి, సంఘం మల్లారెడ్డి, కేశపల్లి శేఖర్ రెడ్డి, గుర్రాల మల్లారెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**దౌల్తాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:**
దౌల్తాబాద్ మండలంలోని నర్సాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహ ప్రవేశ కార్యక్రమం సోమవారంరోజు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ర్యాలపాటి సుగుణమ్మ, కందూరు చిట్టెమ్మలు నూతనంగా నిర్మించుకున్న ఇళ్లలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు బిఆర్ఆర్ చేయూత

**యాచారం, సెప్టెంబర్7, ప్రభాతవార్త:**
యాచారం మండల పరిధిలోని అయ్యవారి గూడ గ్రామపంచాయతీలోని డ్వాక్రా సంఘాలకు బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్చీల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తాడిపర్తి ఘనంగా బోనాలు

**యాచారం, సెప్టెంబర్7, ప్రభాతవార్త:**
యాచారం మండలం తాడిపర్తి గ్రామంలో పోచమ్మ పెద్దమ్మ బోనాల ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తాడిపర్తి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీలం రాములు దంపతులు పోచమ్మ తల్లికి ముదిరాజ్ పెద్దమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.

## అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు

**కేశంపేట, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:**
కేశంపేట మండల కేంద్రంలో సోమవారం పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోషం శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను అలంకరించుకుని అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాల నడుమ బోనాల ఊరేగింపుఉత్సాహంగా సాగింది. మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకుని పోచమ్మ తల్లికి సమర్పించి ప్రత్యేక పూజలునిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని కుటుంబ సభ్యులుసుఖసంతోషాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి పండుగ వాతావరణాన్ని తలపించాయి . పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షి ంచారు. బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రముఖులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణికి స్పందన అంతంతే

**యాచారం, సెప్టెంబర్7 ప్రభాతవార్త**
యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించిన ఈ సందర్భంగా ప్రజల నుండి రెవెన్యూ సమస్యలకు సంబంధించి మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

## పిఆర్టియు నూతన కార్యవర్గం ఎన్నిక

**చౌడపూర్ సెప్టెంబరు 7 ప్రభాతవార్త :**
వికారాబాద్ జిల్లా పిఆర్టియు సమక్షంలో చౌడపూర్ మండల నూతన పిఆర్టియు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం , పిఆర్టియు మండల శాఖ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధ్యకులుగా గులాం మహమూద్, గౌరవ అధ్యక్షులు గా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్ లన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. ఈకార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కార్యదర్శి అమర్నాథ్ , మహిళా కార్యదర్శి సునీత,, మండల ఉపాధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు.



## పూడూరులో బిఆర్ఎస్ పార్టీ బైకు ర్యాలీ

**పూడూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**
రేవంతూ...నిన్ను దించుడే మావంతు అంటూ వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పు మహేష్‌రెడ్డిలు నినదించారు. 1000రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం పరిగి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పూడూరు మండలంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మన్నెగూడ చౌరాస్తానుండి పూడూరు వరకు భారీఎత్తున బైకు ర్యాలీ నిర్వహించి ఎంపిడిఓ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అధ్వర్యంలో సూపరింటెండెంట్ శివప్రకాష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వేయిరోజులైన ప్రజా సంక్షేమాన్ని మరిచిందని, 420హామీల్లో ఏఒక్కటికూడా అమలు పరుచలేదని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి డిల్లీకి మూటలుమోస్తూ, ప్రజాసంక్షేమాన్ని మరిచారని వివరించారు. ప్రజల కోసం ప్రశ్నించిన ప్రతిపక్షంపై అక్రమకేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులను కూడా మోసం చేసింది కాంగ్రెస్‌అని, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఇళ్లు కట్టించడమే ప్రభుత్వం లక్ష్యం

-చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య వెల్లడి

**చేవెళ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** పేద ప్రజలకు ఇళ్లు కట్టించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్య మని చేవెళ్ల ఏమ్మేల్యే కాలేయాదయ్య అన్నారు . సోమవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిదిలోని దేవుని ఎర్రవల్లి వార్డులో బోడపోతుల శ్రీని వాస్ గౌడ్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లును చేవెళ్ల శాసనసభ్యులు కాలేయాదయ్య ప్రారంభించారు. ఈ సందర్బంగా చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు అనేది ఒక కల. ఆ కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతికుటుంబానికి సొంతింటికలను నెరవేర్చేం దుకు కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మెంబెర్ చింపుల సత్యనారాయణ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రభుత్వానికి తొత్తులుగా పోలీసు వ్యవస్థ

**చేవెళ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**
ప్రభుత్వానికి తొత్తులుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని, పోలీసుల తీరు మార్చుకోవాలనిచేవెళ్ల మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ అన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఏమ్మేల్యే సబిత ఇంద్రా రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా చేవెళ్లలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం చేవెళ్ల జాతీయ రహదారిపై ధర్నా చేశారు. బిఆర్ఎస్ నాయకులు బీజాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్బంగా చేవెళ్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులను అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ముఖ్యంగా మహిళా నాయకురాలు మాజీమంత్రి సబిత ఇంద్రారెడ్డిని జుట్టు పట్టుకొని లాగడం ఎంటన్నారు. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను అణిచివేయడం సరికాదని నాయకులు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, సిద్ది బాలు తదితరులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మోమిన్‌పేటలో బిఆర్ఎస్ శక్తి ప్రదర్శన

**మోమిన్‌పేట్, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, గట్టు రామచంద్రరావు అన్నారు. రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మోమిన్ పేట్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. మోమిన్‌పేట్ మండల కేంద్రం ప్రధాన రహదారి కూడలిలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అంబేద్కర్ చౌరస్తా నుండి పాతబస్టాండ్ వరకు భారీ శాంతియుతర్యాలీ చేపట్టారు . ఈ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దబ్బని వెంకట్, సర్పంచులు బండ విష్ణువర్ధన్ రెడ్డి, పటేల్ గారి శ్రీకాంత్ గౌడ్, అరుణ బిచ్చయ్య, కిష్టయ్య, మాజీ బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఫీజు బకాయిలు విడుదల చేయాలి.. ప్రశ్నిస్తే అరెస్టులా?

**కొత్తూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**
విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన బీజేపీ, ముందస్తుగా బిజెపి జిల్లా కో కన్వీనర్ అమడపురం నరసింహ గౌడ్, కొత్తూరు మండలం బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులను సోమవారం పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. బీజేపీ నాయకులు అమడపురం నర్సింసింహ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా
## సంతోష్ గుప్తకు ఘన సన్మానం

**కేశంపేట సెప్టెంబరు 7 ప్రభాతవార్త :**
నూతనంగా ఎన్నికైన కేశంపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీరమల్ల సంతోష్ గుప్తను కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంతోష్ గుప్తకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు
### ఎమ్మెల్సీ తాతా మధు బహిరంగ క్షమాపణ చెప్పాలి

**కేశంపేట, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు హనుమగళ్ల రమేష్ తీవ్రంగా ఖండించారు. స్పీకర్‌పదవికి, దళితసమాజానికి అవమానం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదనిఆయన అన్నారు .ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడంబాధ్యతారాహిత్యమని విమర్శించారు.

## తాత మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**ధారూర్, సెప్టెంబర్ 7, ప్రభాత వార్త:** శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ధారూర్



ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ధారూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద డీసీసీ కార్యదర్శి బాబా ఖాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తీవ్ర నిరసన తెలిపారు. అనంతరం వారు నేరుగా ధారూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సి ఐ ఫిర్యాదు అందజేశారు.

బాధ్యతాయుతమైన పదవిలో ఉండి సభాపతిని కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ తాత మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఆయన ఎమ్మెల్సీ పదవిని రద్దు చేసే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో వారు డిమాండ్ చేశారు.

# అలియాబాద్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అలియాబాద్ మున్సిపల్ పరిధిలో వార్డులో నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న కౌన్సిలర్లు, కమిషనర్, అధికారుల, నాయకుల దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:**
అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం పలు నిర్మాణాలకు అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి శంకుస్థాపనలు చేశారు. వివిధ వార్డుల్లో మురికి కాలువల సమస్యను పరిష్కరించటానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని అలియాబాద్‌లోని 9వ వార్డులో మున్సిపల్ సాదారణ నిధులు 6లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. అదే విధంగా మజీద్‌పూర్‌లోని 10వ వార్డులో బాలాజీ హోమ్స్‌లో మున్సిపల్ సాదారణ నిధులు రూ.5లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టటానికి ఆమె శంకుస్థాపనలు చేశారు. యాదారంలోని 12వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపనులు చేపట్టటానికి చైర్‌పర్సన్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో సమస్యలను పరిష్కరించటానికి మున్సిపల్ సాధారణ నిధులతో అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో మురికి సమస్యను పరిష్కరించటానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణపనులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

ఆయా వార్డుల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో కౌన్సిలర్లు సరసం వనజఅశోక్‌రెడ్డి, సామల జశ్వంత్‌రెడ్డి, వడగం యమునశ్యామ్, గూడె వెంకటేశ, ముద్దం సుదాకర్‌రెడ్డి, గాదె వెంకటేశ, హనుమాన్‌దాస్‌గౌడ్, కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి, ఎఇఇ సనా షాహిన్, మాజీ సర్పంచు చీదు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, నాయకులు వి.దినేశ్, వి.శ్యామ్ ,పలువురు నాయకులు, అధికారులు, సిబ్బంది, ఆయా వార్డుల ప్రజలు, పాల్గొన్నారు.

# ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల ప్రధానోత్సవం




ఉత్తమ అవార్డులను అందుకున్న ఉపాధ్యాయులకు సన్మానించిన ఎంఈఓ

**ధారూర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి చెన్నయ్య ఆధ్వర్యంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ప్రధానోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యా రంగంలో విశేష సేవలందిస్తూ ప్రతిభ కనబరిచిన మండలంలోని మొత్తం పదిహేను మంది ఉపాధ్యాయులకు ఈ అవార్డులను ఘనంగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లయ్య జె, ఆకులూరి మురళీకృష్ణ, ఎం. పాండు, జ్యోతి కె, జె. శ్రీకాంత్, ఆర్. జ్యోతి, కె. బలరాజ్, బి. అశ్విని, సి. శ్రీనివాస్, ఆర్. అఖిల, కావ్య స్వప్న, డి. సరస్వతి, ఎం. సత్యనారాయణ రావు, తెలుగు అంజయ్య, వి. తారియ లు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సాజిదా బేగం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నర్సింలు, మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ హనుమంత్ రెడ్డి, మండల ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మాణిక్యం, మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**కొడంగల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:**
సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని కొడంగల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వ ర్యంలో సోమవారం నియోజకవర్గంలోని వివిధమండలాల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తే అలాంటిపిల్లలను విద్యాబుద్దులతో ఉన్నతస్థానాలకు చేర్చేది ఉపాధ్యాయులేనన్నారు. దేశ భవిష్యత్తుకు పునాది, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. అలాంటి గురులను సన్మానించుకోవడం ప్రతి ఒక్కరి ధర్మమని అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవ త్సరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్క రించుకొని ఎంపికచేసిన ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పి.నర్సి ములు(ఎస్ఏ జడ్పీహెచ్ఎస్ బొంరాస్‌పేట్) ,ఎస్.అమూల్య (ఎస్‌జీటీ, లింగంపల్లి) మోహన్ (ఎస్ఏ, జడ్పీహెచ్ఎస్ బిచ్చాల్ )కె.కేశవులు (ఎంపీపీఎస్ ఈర్లపల్లి)జీ.శ్రీనివాసులు (జడ్పీహెచ్ఎస్ దుద్యాల్) ఉమా మహేష్ (ఎస్‌జీటీ, సత్తర్‌కుంట తాండ), అశోక్ (ఎన్‌జీటీ, అప్పాయివల్లి) కె.సత్యవతి(ఎన్‌జీటీ కొడంగల్)కే.రాంరెడ్డి(ఎంఈఓ) తదితర ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ సాకేత్, మురారి వశిష్ట, వడ్డే భీంరాజ్, శ్రీనివాస్‌గౌడ్, శరణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## గురువు చేతిలోనే రేపటి తరం భవిష్యత్తు

**కొత్తూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త;**
గురువు సమాజానికి మార్గదర్శి అని, ఆయన చేతిలోనే రేపటి తరం భవిష్యత్తు ఆధారపడి ఉందని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కొత్తూరు మండలం కోడిచర్ల తండా గ్రామపంచాయతీలో మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎంఈఓ వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఖాజీగూడ, కోడిచర్ల తండా, కోడిచర్లకు చెందిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా లీనివీ మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠాలు మాత్రమే కాకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ నేర్పాలని సూచించారు. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ "గురువు చేతిలో ఉన్నది చాక్ ముక్క కాదు.. ఒక తరం భవిష్యత్తు" అని అన్నారు. కాజిగూడ తండాకు చెందిన ఉపాధ్యాయుడు కృష్ణ సార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడంతో ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతి విష్ణు నాయక్, హెచ్ఎం రఘుపతి రెడ్డి, ఉపాధ్యాయులు సుహాసిని, శ్రీలత, వరలక్ష్మి, నాగలక్ష్మి, లక్ష్మీ, అంగన్వాడీ టీచర్ లక్ష్మి, డిప్యూటీ సర్పంచ్ స్వప్న, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ఆరోణలు,విమర్శలు చేస్తే ఖబడ్దార్

-విధానపరమైన చర్చలకు సిద్ధం

**యాలాల సెప్టెంబరు 7,ప్రభాతవార్త :** తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహం రెడ్డిపై బిఆర్ఎస్ నాయకులు పస లేని ఆరోపణలు, విమర్శలు చేయడం సిగ్గుచేటని యాలాల మండల పిఏసిఎస్ చైర్మన్ గుర్రాల సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ యాదవ్, మాజి అధ్యక్షులు భీమప్ప, ముదిరాజ్ సంఘం నాయకులు హన్మంతు ముదిరాజ్, నాయకులు అనీల్‌కుమార్, అమృతప్ప, యూత వింగ్ లీడర్ వీరేషం తదితరులు సోమవారం యాలాలలో నిర్వహించిన విలేకరుల సమాశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ హాయంలో ఉత్తుత్తి జిఒలతో కాలయాపన చేస్తూ ప్రజా సమస్యలను గాలికొదిలేదంవల్లే ప్రజలు గట్టి బుద్ధి చెప్పిన విషయాన్ని వారు విస్మరించడం విడ్డూరమన్నారు. దమ్ముంటే విధానపరమైన ఆరోపణలు, విమర్శలు చేయాలని, అవాకులు, చవాకులు మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్దంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 8న చలో హైదరాబాద్ ధర్నాకు భారీగా తరలిరావాలి

**కొత్తూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు గత 20 ఏళ్లకు పైగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ కీలకపాత్ర పోషిస్తున్నారని, అయితే వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని సిఐటియూ రంగారెడ్డి జిల్లా నాయకులు బీస సాయిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న నిర్వహించనున్న చలో హైదరాబాద్ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తూరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తిలకు ముందస్తుగా వినతిపత్రాలు సమర్పించారు. ఆశా వర్కర్ల కనీస డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సాయిబాబు డిమాండ్ చేశారు ఇంతటి సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర ప్రయోజనాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

-బిఆర్ఎస్ నేతల డిమాండ్

**యాలాల సెప్టెంబరు 7,ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని యాలాల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బిఆర్ఎస్ పార్టీ తాండూరు ఇంచార్జీ శ్రీశైల్‌రెడ్డి, నాయకులతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు పిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరుగ్యారంటీలు, 420 హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ వెయ్యి రోజులైనా నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. పథకాల అమలులో కాంగ్రెస్ ఘోరంగా విఫమైందని వారు విమర్శించారు. తులం బంగారం, నిరుద్యోగ బృతి, విద్యా భరోసా కార్డులు, రెండు లక్షల రుణమాఫీ, తదితర దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నిలువునా మోసం చేసిందని వార ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిఏసిఎస్ వైస్ చైర్మన్ వడ్డెరాములు, మాజి జడ్పిటిసి ఎస్ శ్రీనివాస్, చంద్ర శేఖర్‌రెడ్డి, కిరణ్ ,క్రిష్ణ, రాజు, శ్రీనివాస్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి వేదిక

**కొత్తూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో కొత్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ సిహెచ్. అరుంధతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 6 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో మున్సిపాలిటీకి సంబంధించి ఒకటి, ఇరిగేషన్ శాఖకు ఒకటి, రెవెన్యూ శాఖకు నాలుగు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ సిహెచ్. అరుంధతి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఘట్‌కేసర్ నుంచి నగరానికి బిజెపి పాదయాత్ర

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో రైల్వేగేటుపై గత 13 సంవత్సరాలుగా నిర్మిస్తున్న రైల్వేవంతెనను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఘట్‌కేసర్ నుంచి హైదరాబాద్ వరకు బిజెపి నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఘట్‌కేసర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈపాదయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన హైదరాబాద్ వరకు పాదయాత్రలో చేశారు. రైల్వే గేట్ వద్ద ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వర్షంలో సైతం నిర్వహిస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి జాతీయరహదారి ఉప్పల్ మీదుగా ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్‌బీ కార్యాలయం వరకు కొనసాగించారు. పాదయాత్రకు మద్దతుగా వచ్చిన బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డిని చిక్కడపల్లి పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారని బీజేపీ నాయకులు ఆరోపించారు.

శాంతియుతంగా పాదయాత్ర చేస్తూ ఆర్ఓబి త్వరితగతిన పూర్తి చేయాలని నినాదాలు చేసిన తమను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారని పేర్కొంటూ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ నాయకులు ఆర్అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్ జీ.వనజను కలిసి ఘట్‌కేసర్ వంతెన నిర్మాణానికి సంబంధించిన సమస్యలను వివరించారు. వంతెన నిర్మాణం ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, డివిజన్ ప్రధానకార్యదర్శులు మంగు రాధిక, కిరణ్, కమలాకర్, బండారు పవన్‌రెడ్డి, శివనాయక్, అజయ్‌యాదవ్, బాలుయాదవ్, గుండె నరేష్, వీరారెడ్డి, రామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

I Md Mujahid Hussain S/o Mohammed Hussain, R/o H.No.8-7-30/7H, Momin Galli, Old Tandur, Tandur, Vikarabad Dist, TG, have changed my name from Mohammed Mujahid to Md Mujahid Hussain for all future purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



## మర్పల్లిలో నిరసన ర్యాలీ

**దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసన**

**మర్పల్లి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** దళిత స్పీకర్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసుదన్‌చేసిన అనుచిత అసభ్యకర వ్యాఖ్యాలను నిరసిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు.స్పీకర్‌ను కించపరిచే విధంగా అసభ్యపదజాలం ఉపయోగించడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్సి తాతా మధుసూదన్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని మండల నాయకులు పార్టీ అద్యక్షులు సురేష్‌యాదవ్,జిల్లా పార్టీ అద్యక్షులు రబెందర్‌సర్పంచ్ రామేశ్వర్, నాగేష్,నర్సింలు,రాములు శఖర్‌యాదవ్,పలువురు సర్పంచ్‌లు నామకులు డిమాండ్ చేశారు.

## అర్హులైన ప్రతివారికి ఇందిరమ్మ గృహాలు

**మర్పల్లి, సెప్టెంబర్7, ప్రభాతవార్త :** అర్హులైన ప్రతివారికి ఇంధిరమ్మ పక్కాగృహాలు మంజూరి చేస్తామని పిల్లిగుండ్ల సర్పంచ్ ఆకుల పద్మ సంజివరెడ్డి అన్నారు.సోమవారం నాడు గ్రామంలో నిర్మించిన బ్యాగరి శ్రీనివాస్ గృహాన్ని వారు ప్రారంబించారు.లబ్దిదారులను సర్పంచ్ నూతన వస్త్రాలు పెట్టి వారి ఆశీర్వదించారు.ఈకార్యమంలో ఉప సర్పంచ్ మల్లేశం, యాదయ్య, సుదర్శన్‌రెడ్డి,శంకర్ ,శంకరయ్య, మొగులయ్య, సత్తయ్య, భరత్ భూషన్, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం

**మొయినాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** మండలం చిన్న మంగళారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ..పామేన భీమ్ భరత్ గారు.. హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిషాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్దిదారు కొంగండ్ల. సరితా సత్తయ్య ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారులు నూతన గృహ ప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డికి చేవెళ్ళ నియోజకవర్గ ప్రజలందరి తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు మాన్యయ్య, ఉప సర్పంచ్‌ల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్‌లు బాలమణి రాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు మాడి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మాధవ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గణేష్ గౌడ్, లేబర్ సెల్ నియోజవర్గ అధ్యక్షులు శివ శంకర్ గౌడ్, దయాకర్ రెడ్డి, ప్రభాకర్, వార్డ్ మెంబర్స్ రత్నయ్య, పాండు, రమేష్,ఆరిఫా షబీర్ ,రేణుక రమేష్, ప్రభాకర్ గారు గోపాల్ రెడ్డి,గణేష్ గౌడ్, మల్లేష్ గౌడ్,బిక్షపతి గౌడ్, శ్రీకాంత్ రెడ్డి,విట్టల్,దయాకర్ గౌడ్, రాజు, గోపాల్,వెంకటేష్,శివశంకర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## దళిత స్పీకర్‌పై బిఆర్ఎస్ అహంకారం తగదు

**మొయినాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు మరియు అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని మొయినాబాద్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లిగిద్ద సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా బొల్లిగిద్ద సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ స్థానానికి ఒక ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని, అలాంటిది ఒక దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను పట్టుకొని అంతటి అసభ్య పదజాలంతో దూషించడం బిఆర్ఎస్ పార్టీ యొక్క అహంకారానికి, దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. పదవుల అహంకారంతో ప్రతిపక్ష నాయకులు విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు.రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిని గౌరవించడం కనీస బాధ్యత అని, దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే మొత్తం దళిత సమాజాన్ని అవమానించడమేనని బొల్లిగిద్ద సత్యనారాయణ గారు స్పష్టం చేశారు. తక్షణమే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్‌కు మరియు దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే బీఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెబుతారని బొల్లిగిద్ద సత్యనారాయణ హెచ్చరించారు.

## సేంద్రియ సాగుతో నేలకు సారం




షాబాద్‌లో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సేంద్రియ వ్యవసాయ నిపుణులు జి. శ్రీకాంత్, వెల్‌స్పన్ ఫౌండేషన్ సహాయ నిర్వాహకులు పవన్‌కుమార్ తదితరులు.

**షాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** సేంద్రియ వ్యవసాయంతో నేల ఆరోగ్యం మెరుగుపడి, సాగు ఖర్చులు తగ్గుతాయని తిమ్మారెడ్డిగూడ సర్పంచ్ గుత్తి చెన్నయ్య అన్నారు. సోమవారం గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ సహకారంతో జనవికాస్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సును తిమ్మారెడ్డి గూడలో సోమవారం నిర్వహించారు.సేంద్రియ వ్యవసాయ నిపుణులు జి. శ్రీకాంత్ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తయారీ, వినియోగంపై వివరించారు. వెల్‌స్పన్ ఫౌండేషన్ సహాయ నిర్వాహకులు పవన్‌కుమార్ మట్టి నమూనాల సేకరణ, సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమన్వయకర్త బద్రి, వ్యవసాయ విస్తరణ అధికారి శైలజ, జనవికాస్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సంపత్‌కుమార్, సాయికృష్ణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## షాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా

**సిఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం**

**షాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు హాజరుకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు, దాడులు చేయిస్తుందని షాబాద్ మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ఫ్లోర్ లీడర్లు తన్నీరు హరీష్ రావు, పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి లపై పోలీసులు దాడి చేసి, అక్రమ అరెస్టులు చేయడానికి నిరసనగా సోమవారం షాబాద్ మండల కేంద్రంలోని ముంబాయి బెంగుళూరు లింకు జాతీయ రహదారిపై పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సీఎం డౌన్ డౌన్... సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. అనంతరం పోలీసులు ధర్నా చేస్తున్న అవినాష్ రెడ్డి తో పాటు పార్టీ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీరాంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్ గౌడ్, సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్ రెడ్డి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కోలన్ ప్రభాకర్ రెడ్డి, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు, మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు తదితరులున్నారు.



# యువత క్రీడల్లో రాణించాలి

**- సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి**

**- ఆర్కపల్లి ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన మండల స్థాయి క్రీడా పోటీలు**

**మాడ్గుల, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్కపల్లి గ్రామ సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. సోమవారం ఆర్కపల్లి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భారతదేశ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మండల స్థాయి క్రీడా పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది విద్యార్థుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన అవకాశాలు, ప్రోత్సాహం లేకపోవడంతో వారి ప్రతిభ వెలుగులోకి రావడం లేదన్నారు. ఇలాంటి పోటీల ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.చదువు ఎంత ముఖ్యమో విద్యార్థుల ఆరోగ్యానికి క్రీడలు కూడా అంతే ముఖ్యమని ఆమె అన్నారు. ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా, చురుకుగా ఉండటంతో పాటు మానసిక ఒత్తిడిని అధిగమించగలరని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల జట్టుగా పనిచేసే లక్షణం, ఓటమిని స్వీకరించే మనస్తత్వం, గెలుపు కోసం కృషి చేసే పట్టుదల పెరుగుతాయని చెప్పారు.మండల స్థాయి క్రీడా పోటీల్లో ఆర్కపల్లి, ఇర్విన్, మాడ్గుల, నాగిళ్ల, కొల్కులకులపల్లి, అవురుపల్లి, కలకొండ, అందుగుల, సెంట్ మెరి, నవోదయ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరై ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులను అభినందిస్తూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఒక పోటీలో ఓటమి ఎదురైనా నిరుత్సాహపడకుండా, దానిని పాఠంగా తీసుకొని మరింత కష్టపడి ముందుకు సాగాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి మండలానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆమె కోరారు. విద్యార్థులు చదువు, క్రీడలు రెండింటినీ సమన్వయం చేసుకుంటూ తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు, నిర్వాహకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు,నాయకులు

# కన్నుల పండువగా శివపార్వతుల కళ్యాణం

**వేడుకలను తిలకించడానికి భారీగా తరలివచ్చిన భక్తులు**

**షాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** చివరి శ్రావణ సోమవారంను పరస్కరించుకొని శివపార్వతుల కళ్యాణం కన్నుల పండువగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. షాబాద్ మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో శ్రీ బుగ్గరామేశ్వర స్వామి దేవాలయంలో బాజాభజంత్రీల మధ్య వేదపండితులు శివపార్వతుల వారి కళ్యాణం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు తీసుకువచ్చిన తలంబ్రాలు స్వామి వారికి పోయించారు. శివనామ స్మరణతో దేవాలయం మార్మోగింది. స్వామి వారి కళ్యాణం చూడడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుక్కల పద్మమ్మగోపాల్, ఆలయ చైర్మన్ వెంకటయ్య, ఉపసర్పంచ్ శేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడు మాణయ్య, నాయకులు మహేందర్, రాము, రమేష్, మహేల దర్, గూడెం రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కామరబండలో శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా శోభన్

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గాలిగూడ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైయారు. ఈ సందర్భంగా సోమవారం శోభన్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగ అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదారత చాటిన వసీం

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగూడెం తహసిల్దార్ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా భూ భారతి పాస్‌బుక్ ప్రింటర్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కి.శే సదర్ మొహమ్మద్ ఇక్బాల్ తనయుడు మొహమ్మద్ వసీం వెంటనే స్పందించి తహసీల్దారు కార్యాలయంలో ప్రింటర్ అందించేందుకు ముందకు వచ్చి తన ఉదారతను చాటు కున్నారు. దాదాపు రూ.40వేల విలువైన ప్రింటర్‌ను కార్యాలయానికి అందిం చారు. సోమవారం ఉప తహశీల్దార్ భాస్కర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి పాస్ బుక్ ప్రింటర్ ఇవ్వడం అభినంద"నీయం అన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అలీం పాషా, మొహమ్మద్ సమద్, నవాబ్ సాబ్, ఫారూఖ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రింటర్‌ను అందజేస్తున్న దాతలు

## ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం




**షాబాద్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని హోప్ ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర హాకీ సంఘం అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం షాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యా యులు కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందిస్తూ ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు మల్లికార్జున్, షఫీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల లైన్‌మెన్‌ను శంకర్‌పల్లి విద్యుత్ కార్యాలయంకు బదిలీ

**మా కోద్దు ఈ లైన్ మెన్ వార్తకు స్పందన**

**చేవెళ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :** చేవెళ్ల విద్యుత్ కార్యాలయంలో లైన్ మెన్‌గా పుల్లయ్య విధులు నిర్వహించడం లేదని మా కోద్దు లైన్ మెన్.. వెంటనే చర్యలు తీసుకోవాలని కథనంను ఈ నెల 7వ తేదిన ప్రచురించిన వార్త కథనంకు స్పందించిన అధికారులు లైన్ మెన్ పుల్లయ్యను బదీలీ చేశారు. చేవెళ్ల విద్యుత్ కార్యాలయంలో విదులు నిర్వహిస్తున్న పుల్లయ్యను శంకర్‌పల్లి విద్యుత్ కార్యాలయంకు బదీలీ చేస్తూ సొమవారం టిజిఎస్‌పిడిసిఎల్ చేవెళ్ల ఎఇ రాజేందర్ ఉత్తర్వులను జారీ చేశారు. శంకర్‌పల్లి లైన్‌మెన్‌గా బదీలైన పుల్లయ్యను రీలీవ్ చేశారు.

## మోమిన్‌పేటలో కాంగ్రెస్ నాయకుల నిరసన

**మోమిన్‌పేట్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మోమిన్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నె శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మోమిన్‌పేట మండల పరిషత్ కార్యాలయ పాత బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు అనంతరం తాత మధు దిష్టిబొమ్మను దహనం చేసి నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మర్పల్లి మార్కెట్ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ఆయన తల్లిపై కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చర్యలు తీసుకోని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణెయ్య, డిసిసి ఉపాధ్యక్షులు సుభాష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు సురేందర్, మల్లారెడ్డి కృష్ణయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాష్, ఆయా గ్రామాల సర్పంచులు మండలనాయకులు కార్యకర్తలు యువజన సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలోని ఎస్సీ ప్రభుత్వ బాల బాలికల కళాశాల వసతి గృహాలకు స్థలం కేటాయించాలి

**చేవెళ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**

చేవెళ్లలోని ఎస్సీ ప్రభుత్వ బాల బాలికల కళాశాల వసతి గృహాలకు స్థలం కేటాయించాలిఎస్ఎఫ్ఐ నాయకుడు రాజేష్ డిమాండ్ చేశారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఎస్సీ ప్రభుత్వ బాలుర బాలికల కళాశాల వసతి గృహాలకు సొంత స్థలం కేటా యించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు, ఎమ్మెస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఖానాపురం రాజేష్, కవేలి రాములు, ఎం.చందులు మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ పార్టీల కార్యాలయాలకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులకు వెన్నువెంటనే నిధులు విడుదల చేసి స్థలాలు చూపించి నిర్మాణాలు చేపడుతున్నారని, కానీ విద్యార్థులు చదువుకొని దేశ భవిష్యత్తు, వారి భవిష్యత్తు కోసం ఉపయోగపడేటటువంటి వసతి గృహ భవనాలను మాత్రం నిర్మించడం లేదని విమర్శించారు. గత 2018 సంవత్సరంలో చేవెళ్ల మండల కేంద్రంలో వసతి గృహాలు ప్రారంభించడం జరిగిందన్నారు. అప్పటినుండి ఇప్పటిక వరకు అద్దె భవనంలో కొనసాగుతున్నాయని, అద్దె భవనంలో సరైన సమయానికి ప్రభుత్వం నుండి డబ్బులు రాకపోవడం వలన ఇంటి యజమానులు చాలా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కనీసం విద్యార్థులకు సౌకర్యాలు కూడా లేవు అందువలన విద్యార్థులను వారి బంగారు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చేవెళ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ వసతి గృహాలకు సొంత స్థలాన్ని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్టు, వ్యవహరిస్తే మంత్రులను, ఎమ్మె ల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## కాంగ్రెస్ 420 హామీలను వెంటనే అమలు చేయాలి

**చేవెళ్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :** కాంగ్రెస్ 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో సోమవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవో పార్థసింహారెడ్డికి కాంగ్రెస్ 420 హామీల తక్షణ అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంను సాగనంపాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ అధిష్టానం ఇచ్చిన 7 రోజుల నిరసన పిలుపులో భాగంగా, ఆరో రోజున చేవెళ్ల నియోజకవర్గంలో నిరసన కార్యక్రమం నిర్వహించామన్నారు.

# హక్కులను హరించడం సరికాదు



విలెకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో హక్కులను హరించడం సరికాదని జిల్లెడు చౌదరిగూడ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు బాబురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలెకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళ ఎమ్మెల్యేలని అని చూడకుండ మాజీ సీనియర్ మంత్రి సబిత, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిల్లపై దాడి చేయడం ప్రజాస్వామ్యనికి మచ్చని అన్నారు. 100 రోజులలో ఆరు గ్యారంటీలు 420 హామీలు యిచ్చి వాటిని అమలు చేయకుండ ప్రతిపక్షాలపై ప్రభుత్వం దాడిచేసి అక్రమ అరెస్ట్‌చేయడం ఎంతవరకు సమంజస మన్నారు. ఇకనైనా యిచ్చిన హామీలను నెరవేర్చే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరినాయక్, సీనియర్ నాయకులు రమేష్ నాయక్, నవీన్ పటేల్,మైపాల్ రెడ్డి,శ్రీరాములు, వెంకటేష్, సందీప్, మంగ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా బి ఆర్ఎస్ రాస్తారోకో!

**కొందుర్గు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:** అసెంబ్లీ సమావేశానికి వెళ్తున్న బి ఆర్.ఎస్. ఎమ్మెల్యేలపై పోలీసుల దాడికి నిరసనగా ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారంనాడు హైదరాబాదులో అసెంబ్లీ సమావేశాలకు వెళుతున్న బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అడ్డగించి వారి పై దాడి చేసినందుకు నిరసనగా ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు బస్టాండ్ ముందు షాద్నగర్ పరిగి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.దాంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని పార్టీ నాయకులతో మాట్లాడి విరమింప చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ప్రభుత్వ చర్యను ఖండించారు. ఎమ్మెల్యేలపై దాడిచేసిన పోలీసులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు . ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని, అడ్డుకునే హక్కు లేదని వారు అన్నారు. కేంద్రంలో ప్రతిపక్ష నాయ కులు రాహుల్ గాంధీ నల్ల దుస్తులు ధరించి పార్లమెంటుకు వెళ్లొచ్చు కానీ, ఇక్కడ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి ఎందుకు అసెంబ్లీకి వెళ్లొద్దని వారు ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. ఈ చర్యను ప్రజలందరూ గమనించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పలు గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## అక్రమ అరెస్టులతో పోలీసు రాజ్యం

**మాడ్గుల, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ బీజేపీ చేపడుతున్న ప్రజా ఉద్యమాలను అడ్డుకునేందుకు నాయకులను అక్రమం గా అరెస్టుచేయడం, గృహ నిర్బంధాలకు పాల్పడటం ప్రజాస్వామ్యా నికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం యువతకు నిరుద్యోగ భృతి, వృద్ధులకు పెన్షన్లు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, స్కూటీలు, రైతుల రుణమాఫీ, రైతు బంధు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తే రాబోయే రోజుల్లో ప్రజలే తగినబుద్ధి చెబుతారని హెచ్చరించారు.



దండు శ్రీనివాస్ గౌడ్‌ను ముందస్తున్న అరెస్ట్ చేస్తున్న మాడ్గుల పోలీసులు

## వృత్తి ప్రాజెక్టులపై అభివృద్ధి శిక్షణ తరగతులు

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** అనురాగ్ యూనివర్సిటీలో కృత్రిమమేథస్సు, వృత్తి మరియు ప్రాజెక్టు నిర్వహణపై రెండు రోజుల వృత్తి పరమైన అభివృద్ధి శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగిందని ప్రొఫెసర్ శ్రీదేవి తెలిపారు. యూనివర్శిటీలోని డేటా సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం. శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో కృత్రిమ మేధస్సు, వృత్తి నిర్వహణ అంశాలపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక వృత్తిపరమైన నైపుణ్యాలను అందించడం శిక్షణ ప్రధాన లక్ష్యమని అన్నారు. 12 గంటల పాటు ప్రత్యక్ష శిక్షణతో పాటు 40 గంటల స్వీయ అభ్యాస ఆన్‌లైన్ శిక్షణను అందించినట్లు తెలిపారు. యంత్ర అభ్యాసం, లోతైన అభ్యాసం, సహజ బాషా ప్రక్రియ, కంప్యూటర్ దృష్టి, ఉత్పాదక కృత్రిమ మేధస్సు ,ఐబీఎం వాట్సన్ స్టూడియోపై ఆచరణాత్మక శిక్షణ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. జనని, శ్రీజ మండల, జి. స్వప్న, టాస్క్ సమన్వయకర్త బి. జ్యోతి, సీఎస్ఐ సమన్వయ కర్త వై. సుగుణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

**కలెక్టర్,ఆర్‌డిఓకి వినతి**




ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆర్‌డిఓకి వినతి పత్రం అందజేస్తున్న రాంపల్లిదాయర గ్రామస్తులు

**కీసర, సెప్టెంబరు7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లిదాయర గ్రామంలోని సర్వే నంబరు 455లో ఉన్న విలువైన ప్రభుత్వభూమిని ఆక్రమణదారుల నుండి కాపాడాలని కోరుతూ సోమవారం రాంపల్లిదాయర గ్రామస్తులు జిల్లాకలెక్టర్ మనుచౌదరి,ఆర్‌డిఓ నల్ల వెంకట్‌రెడ్డికి వినతి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సర్వే నంబరు 455లో ప్రభుత్వ భూమిని సర్వే చేసి సరిహద్దులు గుర్తించాలని కోరుతూ గతంలో ఏప్రిల్ 1 2025న,అలాగే జులై 27,2026న ఉన్నతాధికారులకు వినత పత్రాలను సమర్పించినప్పటికి ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని కొంతమంది అనధికార వ్యక్తులు ప్రభుత్వ స్థలంలోకి చొరబడి గదులు,ప్రహరీ గోడలు నిర్మిస్తూ భూమిని కబ్జా చేస్తున్నారని ఆర్‌డిఓ దృష్టికి తీసుకెళ్లారు.ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి తక్షణ చర్యలు చేపట్టకపోతే విలువైన ప్రభుత్వ భూమి శాశ్వతంగా అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సర్వే నంబరు 455లోని భూమిని సమగ్ర సర్వే నిర్వహించి పక్కాగా హద్దులు నిర్ణయించాలని,ఆక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ భూమి ఖచ్చితమైన విస్తీర్ణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

**పేదలకు అందించే సంక్షేమ ఫలాలను కొనసాగించాలి**

**కొడంగల్, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:** పేదలకు అందించే సంక్షేమ ఫలాలను కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు మాజీ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్ ,ఎర్రన్‌పల్లి శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు.కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు వారు సోమవారం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు అందించే ఇందిరమ్మఇండ్లు,కళ్యాణలక్ష్మీ,షాదీముబారక్,తులం బంగారం, అడపిల్లలకు స్కూటీలు,అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్ రూంఇండ్లు,కొత్తపెన్షన్‌లు,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులకు రూ.2వేల నుంచి రూ.4వేలు,రూ.4వేల నుంచి రూ.6వేలు వెంటనే అమలు చేయాలని ప్రధానంగా వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రావులపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శరణప్ప,ఏర్పుల మోహన్ ,గుండ్ల కుంట బాలరాజు,వెంకటయ్య,జగన్,హనుమంతు, రాజశేఖర్ ,లక్ష్మారెడ్డి,బిచ్చప్ప,రఫిక్,శివ,ఫకుద్దీన్ పాల్గొన్నారు.